# మౌనమే నీ భాష

## -వాలి హిరణ్మయీదేవి కథ

'వసూ! నా పెన్నెక్కడ పెట్టావ్. ఛ ఛ. ఏదీ పెట్టినచోటుండదు కదా'' చిరాకుపడుతూ అన్నాడు అనంత్.

చేతిలోని పనిని పక్కకునెట్టి గబగబా టేబుల్ దగ్గరకొచ్చింది వసంత. పుస్తకాలనటూ-ఇటూ జరిపి వెదికేసరికి, వాటి వెనుక నక్కిన పెన్ కన్పించింది-దాన్ని తీసి విసురుగా అనంత్‌కి అందిస్తూ ''పద్దైనా నిద్రమత్తు వదలదు మీకు. ఏం కాస్త కళ్ళు పూర్తిగా తెరిచి వెదికితే ఏం పోయింది. అన్నీ చేతికందించాల్సిందే కదా... ఆ ఆఫీస్‌లో ఎలా పన్జేస్తారో ఏంటో గానీ...

''అబ్బా-చాల్లేద్దూ- ఆ నస ఆపి అన్నం వడ్డించు. టైమయిపోయింది ''కంగారుగా అన్నాడతడు.

''అవును నాదంతా నసలాగే అన్పిస్తూంటుంది. పొద్దుట లేచి చిన్నపనయినా సాయం చేయరుగానీ పై నుండి అదనపు పనులు పురమాయిస్తుంటారు. నేనూ స్కూల్ కెళ్ళాలిగా-నాకూ మీరన్నీ అందిస్తున్నారా'' అంది వసంత అన్నంవడ్డిస్తూ.

'' ఆ.. ఆ అదొక్కటీ తక్కువయింది'' అన్నం కల్పి పెద్ద పెద్ద ముద్దలు పెట్టుకొంటూ ముద్దగా అన్నాడు అనంత్ వెటకారంగా.....

★ ★ ★

''ఏవండీ! ఏంటీ అప్పుడే నిద్రపోయారా? అన్నం తినేసి ఏకంగా పడుకోవచ్చు కదా'' అంటూ భర్తని లేపింది వసంత.

''ఆఫీస్‌లో పనెక్కువుందోయ్-టి.వి. చూస్తుండగానే కునుకుపట్టేసింది-నీ ట్యూషన్ పిల్లలు వెళ్ళారా? నువ్వేదో పన్లో వున్నావ్ గదాని అలా కళ్ళు కాస్త మూశాను....

అతని మాటలకడ్డొస్తూ ''మీకేం ఇలా కళ్ళు మూయగానే అలా నిద్రపట్టేస్తుంది. అదృష్టవంతులు. టి.వి. కొనుక్కోవాలీ అనుకొన్నంత కాలం పట్టలేదు- దాన్ని స్థిమితంగా చూసే భాగ్యం లేదు నాకు. అంటూ ఏదో అనబోతూంటే.. ''వసూ! చెప్పాగా-ఆఫీస్‌లో పనెక్కువగా ఉందని-తొందరగా అన్నం పెడితే తిని పడుకోవాలి-ఎందుకంటే రేపు తొందరగా వెళ్ళాలి'' అన్నాడతడు.

''మీకా ఆఫీస్‌లో పని ఎక్కువైతేనే అలా అల్లల్లాడిపోతారు-రాగానే ఎంచక్కా నేనందించిన కాఫీ తాగి, టివి చూడ్డమో నడుం వాల్చడమో చేస్తారు. నాకలా కాదే. స్కూల్ నుండి వస్తూ కూరగాయలు తెచ్చుకోవాలి. క్రష్ నుండి పిల్లాడ్ని తేవాలి. పాపతో హోం వర్క్ చేయించాలి. ఉతికిన గుడ్డలు మడతెట్టాలి. మీరు పొద్దుట వేసుకోబోయే బట్టలు ఇస్త్రీ చేయాలి. ట్యూషన్ పిల్లలొస్తే వాళ్ళతో వాగాలి..ఏంటీ? వింటున్నారా? మళ్ళీ నిద్రోతున్నారా''? అతడిని కుదుపుతూ అంది వసంత.

''హు! నువ్వు నోరు విప్పాక నిద్ర నన్నింకా అంటి పెట్టుకొని ఉంటుందా'' అన్నాడు అనంత్.

**ఆ** రోజు ఆదివారం కావడంతో పనంతా ముగించుకొని, ఓ గంట నిద్రపోయి లేచింది వసంత.

ఇంట్లో పిల్లలు కన్పించకపోయేసరికి పెరట్లోకి వెళ్ళి చూసింది. ఆమె రాకను గమనించని పిల్లలు, వాళ్ళ ఆటలో నిమగ్నమయి ఉన్నారు.

''అంటే ఏంటి మీ ఉద్దేశ్యం. నేనేదో ఊసుపోక నోరుపారేసుకొంటున్నాననా? ఏం- నేనా పన్లన్నీ చేయటం లేదా? లేక మీరమర్చిన పనిమనిషి-వంట మనిషి వచ్చి పన్లు చేస్తున్నారా? మీ ప్యూనొచ్చి బజారు పని చేస్తున్నాడా లేక ఆయా వచ్చి పిల్లల పని చూస్తోందా?''

''అబ్బా! ఎరక్కపోయి అన్నాను గానీ, ఇంతకీ ఏంటి?'' విసుగ్గా అన్నాడు.

''అదుగో ఆ చిరాకుని చూస్తేనే ఒళ్ళు మండుతుంది. ఏ పాటు పడి బర్దలయి పోయారని అంత విసుగు...''

'అమ్మా! మహాతల్లీ! ఈ ప్రపంచంలో నువ్వొక్కదానివే కష్టపడుతున్నావ్. మిగతావాళ్ళంతా తేరగా తిని కూర్చుని సుఖపడిపోతున్నారు..చాలా అక్కడ ఆఫీస్‌లో బాస్ అనుక్షణం తల తినేస్తుంటాడు-నువ్వేమో మిగిలింది ఇంట్లో తినేస్తున్నావ్-మెంటల్ హాస్పిటల్ కెళ్ళడానికి ఎంతో టైమ్ పట్టదు'' అంటూ నిండా దుప్పటి ముసుగేసుకొని అటు తిరిగాడు అనంత్.

''ఏంటి? అన్నం తినేది లేదా? నామీద కోపమంతా అన్నం మీద చూపిస్తే ఎలా? అన్నం మీదలిగితే ఆ కాస్త దొరకదు- లేచి తినండి-లేవండి'' అంటూ అరిచింది వసంత.

''ఒక్కసారి చెబితే-మనిషికి బుద్ధుండాలి''అంటూ మరోవైపు తిరిగి పడుకొన్నాడు అనంత్.

ఒక్కసారిగా కళ్ళలో నీళ్ళు తిరిగాయ్ ఆమెకి. అతడు అభోజనంగా పడుకొంటే తనకింక ఏం ముద్ద దిగుతుందనుకొంటూ ఓ గ్లాసుడు మంచినీళ్ళు తాగి పిల్లల పక్కన ఒరిగింది వసంత.

''ఛ-మెల్లగా మాట్లాడి, వాయిదాల పద్ధతి మీద వాషింగ్‌మిషన్‌ని కొన్పించాలనుకుంటే ఇలా బెడిసికొట్టిందేంటి'' పాపం పిల్లలు కూడా జరిగిన గొడవతో బిక్కచచ్చి పడుకున్నారు'' అనుకొంది బాధగా.

''ఓయ్! వసూ ఏం చేస్తున్నావ్? ఆదివారం కదా-ఏదైనా స్పెషల్ టిఫిన్ వుందా?'' అడిగాడు అనంత్.

గ్యాస్ అయిపోయి, పంపుస్టవ్‌ని వెల్గించలేక అవస్థపడుతోన్న వసంతకి చిరాకేసింది.

''ఆ...ఉంది నా తలకాయ' అంది గట్టిగా.

''దాన్ని ఇగురొండుతున్నావా? పులుసా?'' నవ్వుతూ అడిగాడు అనంత్. చురచురా చూసింది వసంత. ఆమె మొహంలో కోపాన్ని గమనించి, బుద్ధిగా ముందుగదిలోకెళ్ళి న్యూస్ పేపర్ పట్టుకొన్నాడు.

''భార్య సాధింపు పడలేక ఓ భర్త ఆత్మహత్య'' అంటూ పేపర్లోని వార్త గట్టిగా చదివాడు వసంతకు విన్పించేలా..

''అమ్మా! తమ్ముడు దొడ్డికెళ్ళాడు...''అరుస్తూ వచ్చి చెప్పింది పాప.

''ఛ.ఛ. వీడూ ఇప్పుడే..అని తలకొట్టుకొంటూ వెళ్ళి బాబుకి కడిగి, అక్కడంతా శుభ్రం చేసి వచ్చేసరికి, స్టవ్ మీద పెట్టిన పాలు పొంగిపోయి స్టవ్ ఆరిపోయింది. దాన్ని చూడగానే ఉసూరుమంది ప్రాణం. గుడ్డ తీసుకొచ్చి అక్కడ శుభ్రం చేస్తూ...''ఛ..వెధవ కొంప. ఏ కొంపలోనైనా ఇంతపని ఉంటుందో ఉండదోగానీ...ఇదేం కొంపో...చేస్తున్నకొద్దీ పని వూరుతూనే ఉంటుంది. ఎక్కడ సుఖపడిపోతానో అన్నట్లు ఏదో కొంప మునిగినట్లు ఈ గుమస్తాగారికి కట్టబెట్టిన మా వాళ్ళననాలి అసలు. ఒక్కదాన్నే కష్టపడుతున్నా-పట్టించుకోకుండా పేపర్ చదువుతూ జోకులేసే మిమ్మల్నవాలి. అయినా ఎవర్ననుకొని ఏం లాభం- నా ఖర్మ ఇలా కాలితే..ఏదన్నా అంటే సాధిస్తున్నానంటారు ఏం. సాధించానని-ఎవర్ని సాధించానని?''

నిర్విరామంగా విన్పిస్తోన్న వసంత సణుగుడిని భరించలేక, విసుగ్గా లేచి షర్టు వేసుకొని బైటకెళ్ళి పోయాడనంత్.

ఉప్మాప్లేట్‌లో పెట్టి దాన్నివ్వడానికి కొచ్చేసరికి భర్త కన్పించకపోయేసరికి ఎక్కడ్లేని విసుగొచ్చింది వసంతకి.

'ఛ..ఇంత చచ్చి చెడి పని చేసి, మొగుడిక్కానీ, పిల్లలకు గానీ ప్రేమగా ఇంతపెట్టుకోలేకపోతోంది. తనొక్కర్తే ఇలా బాధపడుతోందా? లేక ప్రతీ ఉద్యోగస్థురాలి సంగతీ ఇంతేనా? అనుకొంది వసంత.

ఆ రోజు ఆదివారం కావడంతో పనంతా ముగించుకొని, ఓ గంట నిద్రపోయి లేచింది వసంత. ఇంట్లో పిల్లలు కన్పించకపోయేసరికి పెరట్లోకి వెళ్ళి చూసింది. ఆమె రాకను గమనించని పిల్లలు, వాళ్ళ ఆటలో నిమగ్నమయి ఉన్నారు. సరదాగా అన్పించి, వారికి కన్పించకుండా కాస్త వెనక్కి జరిగి పిల్లల్ని గమనించసాగింది వసంత.

''వీడికి ''నాన్న'' పోర్షన్ సరిగ్గా రావటం లేదు. నేనేదన్నా అంటే మాటకు మాట చెబుతున్నావేం? ''అంటోంది వసంత కూతురు రమ్య.

''నేనేం మాట్లాడాలి? అయినా అన్నీ నువ్వే మాట్లాడుతున్నావ్‌గా''అంటున్నాడు పక్కింటి టింకు.

''మా నాన్నగారినేమీ మాట్లాడనీయకుండా మా అమ్మే అరుస్తుందిగా మరి.'' అమాయకంగా అన్న రమ్య మాటలు, వసంతకి ఈటెల్లా తోచాయి.

''మంచి అమ్మలెవరు అరవరు-అస్సలు నీతో ఆడనే ఆడను-అన్నీ నువ్ చెప్పినట్లే చేయమంటావ్-పో''అంటూ ఆట నుండి విరమించుకొని వెళ్ళిపోయాడు టింకు.

బిక్కుమంటూ మిగిలిపోయిన రమ్యని చూస్తే జాలేసింది. తనూ తన నోటి వాడితో చివరికి 'ఒంటరి'గా మిగిలిపోతుందా? ఏంటి? ఆ ఆలోచన నిలువెల్లా వసంతని వణికించింది.

★ ★ ★

పాలవాడొచ్చి ''అమ్మా జున్నుపాలు న్నాయ్-తీసుకోండమ్మా'' అంటూ వస్తే-ఇంట్లో అందరికీ ఇష్టం కదాని లీటర్ పాలు తీసుకొంది వసంత. స్కూల్‌కి ఐదు నిముషాలు లేట్‌గా వెడితే ఏం మునిగేది ఉందని, అప్పటికప్పుడే జున్ను చేసెయ్యాలనుకొంది.

తీరా వంటింట్లో కెళ్ళేసరికి బెల్లం, ఇలాచీలు కన్పించాయ్ గాని మిరియాలు కన్పించలేదు.


మిరియాల కోసం పాపని పంపిద్దామంటే పాప స్కూల్‌కెళ్ళిపోయింది. మిరియాల పొడి వేయకుండా జున్నొండి తింటే వాతం కమ్ముతుం దంటారు-అనుకొంటూ పక్కింటికెళ్ళింది మిరియాల కోసం.

''ఏంటి! నా మూడ్ లేక ఇవాళ మీకు ఎదురుచెబితే అంతగా తిడుతున్నారు. ఆ వసంతా వాళ్ళాయన్ని చూడండి. ఆవిడ రోజూ ప్రతినిముషం సాధిస్తున్నా కిమ్మనడు. అయినా నోరున్నవాళ్ళదే రాజ్యం లెండి''అంటూ పక్కింటావిడ తన పేరుని రిఫర్ చేస్తూ, ఆమెంతో మెతకదాన్నంటూ చాటుకోవడం విన్పించి స్తన్నయింది. పిల్లల మీద తన ప్రభావం, ఇరుగుపొరుగు వారిలో గయ్యాళిగా ముద్ర వేయించుకోడం వసంతని ఆలోచించేలా చేసింది.

తన దగ్గర ట్యూషన్ చెప్పించుకొంటున్న నవ్య అదే రోజు అనుకోకుండా ''స్పీచ్ ఈజ్ సిల్వర్- బట్ సైలెన్స్ ఈజ్ గోల్డ్'' అంటే ఏంటని అడిగింది. దానికి వివరణ ఇస్తోన్న వసంత ఒక్కసారి తనను తాను తరిచి చూసుకొంది. ''ఇన్నాళ్ళు బడబడా వాగి సాధించలేనిది, మౌనంతో సాధించగలనేమో చూద్దాం'' అని స్థిరంగా అనుకోవడమే కాదు-ఖచ్చితంగా అమలులో పెట్టింది.

పది రోజులు గడిచిపోయాయ్.

ఎప్పట్లాగే ఆరోజూ పదిన్నరకి వచ్చాడు అనంత్.



నిద్రకళ్ళతోటే, మౌనంగా అతనికి వడ్డించి-పిల్లల పక్కన ఒరిగింది వసంత.

అన్నం పెడుతూ గంటపాటూ సాధించే వసంత, ఈ మధ్య మాటామంతీ లేకుండా వడ్డించడంతో-అన్నమే రుచించకుండా ఉంటోంది అనంత్‌కి.

అలసిపోయిన వసంతా, పిల్లలు నిద్రలోకి జారుకొన్నా-అనంత్‌కి ఎందుకో నిద్ర పట్టలేదు.

పిల్లల్ని అటూ ఇటూ వేసుకొని పడుకొన్న వసంత, పూలు, పిందెలతో కళకళలాడే పూలతీవెలా తోచిందతని కళ్ళకి. నిశితంగా ఆమెనే చూస్తోన్న అనంత్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. వసంత కళ్ళచుట్టూరా అలుముకొన్న నల్లటి వలయాలని గమనించి.

''నోరేసుకొని అరుస్తూంటుంది గానీ, పాపం అన్ని పనులూ ఒక్కర్తే చేసుకొంటుంది. తన ఫ్రెండ్స్ ఇళ్ళని గమనించినపుడు తెలుస్తుంది వసంత ఇంటిని పిల్లల్ని ఎంత శుభ్రంగా ఉంచుతున్నదీ..వంద రూపాయలు పోతే పోయాయ్ ఓ పనిమనిషిని ఏర్పాటు చేయాలి. తనూ బజారుపనీ-ఇంట్లోని చిన్న చిన్న పనులూ చేస్తూ ఉంటే-వసంతకి పని ఒత్తిడి తగ్గుతుంది. పాపం ఈ మధ్య అరిచే ఓపిక కూడా నశించిందేమో పిచ్చి తల్లికి''-అనుకొన్నాడు. ఆమె మౌనమో-నిరసనో గానీ అతడిని ఆలోచించేలా చేసి, ఆ నిర్ణయాన్ని తీసుకొనేలా చేశాయ్. అటు ఆఫీస్‌లో బాస్ లాంగ్ లీవ్ పెట్టడంతో అతని చీవాట్లు లేవు. ఇటు భార్య అలకవల్ల నిరంతర సాధింపులూ లేవు. అవేవీ లేక అతనికి పిచ్చెక్కినట్లే ఉంది.

మంచం దిగి, 'వసూ వసూ' అంటూ భుజం తట్టి, మెల్లగా పిలిచాడు అనంత్.

''ఊ''అంటూ ఏంటన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించింది వసంత.

''వసూ! అలా మౌనంగా, నిర్లిప్తంగా ఉండి నన్ను బాధపెట్టకు. నువ్వు ఎప్పట్లా ఏదో ఒకటి అంటూ ఉంటేనే బావుంటుంది. నాకు నిజం..నమ్ము..లేకుంటే నిద్ర కూడా పట్టడం లేదు.'' అంటోన్న అనంత్ పసిపిల్లాడిలా కన్పించాడు వసంత కళ్ళకి. ఆర్తిగా అతణ్ణి గుండెలకు హత్తుకొందామె. ఆ చిన్ని చర్య, వాళ్ళిద్దరి మధ్య వారం రోజులుగా పేరుకుపోయిన దూరాన్నిట్టే పారిపోయేలా చేసింది. ఇంతకీ తన 'మౌనం' అనుకున్నది సాధించిందా? లేదా? అర్థంకాలేదా క్షణంలో వసంతకి. ★